# ఎదురు కోళ్లు

మొన్న, మొన్ననె మా అక్క బిడ్డ 'శ్రీ'కి సూడంగ సూడంగ సుక్కదెగి పడ్డట్ల ఇన్నాళ్ల వట్టి పెండ్లివొల్లనంటె వొల్ల నన్ను దానికి వోపిలగాడు మెప్పిత మైండు. మాపిల్లేంసి న్న సన్నదనుకునేరు. మీదిమీది మెరుగలు మెచ్చెరకంగాదు, గట్టిగింజనెదొర్కిండు. ఇల్లు, వాకిలి, నగదునాణెం, పేరు పెద్దిర్కం అన్ని తమకన్న వోబెత్తెడు పొడుగున్న సవందమె దాన్ని తలి దండ్రి అపురూపుకంగ కండ్లకద్దుకోని ఖరారుజేసుకున్నరు. అవును మరి మిస్కితెదుస్కి పాయెనంట, ఈపొద్దు రేపు సదువుకున్న మొగపిల్లలకు ఎత్తుకు ఎత్తువోసి ఎగిరేస్కపోదవంట బార్లుగట్టి సినిమాటిక్కట్లకు నిలవడ్డట్ల ఆడివిల్లల తండ్రులు నిలవ డ్తుంటె ? ఎంత తిక్కోల్లైతె నోటికాడి బుక్కను న్యాలపాల్జేసుకున్నట్ల ఈ సవందాన్ని వదలుకుంటరు?

అందికె మూఢం ఎళ్లంగనె అందుబాట్లున్న వోమంచి మూర్తమంట జూసి పెండ్లివెట్టుకోని సరాసరి పెండ్లి పత్రికలు అచ్చేసి పంపిన్రు.

ఆపత్రిక అందుకున్న మా ఆయిన,'మీ బావ మరీ మాడ్రన్ జెంటిల్ మ్యాన్ ఆయితుండడు, వరపూజ, కన్యానిశ్చయమంట యాదిలేకుండ ఏక్‌దంపెండ్లిదావత్ రుఖ్హా వంపిండు. సూడు అంట పత్రిక నాసేతికిచ్చిండు.

మాఆయిన అంటున్న సూటిపోటిమాట ల్యావి వట్టిచ్చుకోకుండ, అయ్యొ ! పెండ్లి ఇంగెన్ని దినాలు లేదు, వోవారం ముందువోయి సీమా అంట పసుపులు చిట్లిచ్చి, ఇసుర్రాతు పూజిచ్చి, అప్పడం, వొడెం బెట్టనికె అక్కకు తోడైదమంటె సిల్కతల్లికి పరీక్షలాయె ! ఇంగానయం, పెండ్లివో నాల్గు దినాలుండదనంగనె పరీక్షలు ముగుస్తుండయి అంట అనుకుంట ఆత్రం ఆత్రంగ.

ఇప్పుడు వోకుంటె మాటొప్పుతాది ? అక్కజెల్లెండ్లె నంక ఇసోంటియాళ అక్క రకు రాకుంటె ? ఇంగెప్పుడొస్తరు ? అంట మనుసుల నిశ్చితం జేస్కోని పోనికె తయారైన ఇంగ మా ఆయిన రాకెంజేస్తడు.

పెట్టెలల్ల కెళ్లి దాపుడు సీరలు దీసి మడ్తలు దప్పినవి ఏరి ఇస్త్రీర్లుజేపిచ్చి , సొమ్ము లన్ని వొల్సి కుంకుడు కాయరసంల నానవెట్టి రాళ్లురప్పలు జారకుండ వొరక్కట్లతోటి సుతారంగ సాపుజేస్కోని అద్దాలరైకలు జల్తారుతీగెదీసినవి బింగణ్ణరెక్కలు గుట్టినవి బిల్ల సొళ్ల పూసల కూర్పులు కసీదదీసిన పనితనపు ఎన్కటి రైకలన్ని కుట్లు గుండీలు సవ రిచ్చి ఏసీర కారైక జోడిచ్చి సదురుకున్న. మా పిల్ల ఈతతంగం యాదివట్టిచ్చుకోకుండ సాఫ్‌సీదసక్కన ఛెడోలె కాలేజి డిరస్‌ల మొగపోరణోల్లె రైలెక్కె మా పోరిలక్షిణం జూసి నాకు తామసం ముంచుకొచ్చిందిగని సిన్నపిల్లగన్క సెవులువిండుతనా, తొడపాశెం బెట్టి సెప్తన, నా ఎత్తు మించి సద్వులు ఎల్లవెడ్తుండె! దానికితోడు వాళ్లయ్య ముసిముసినగులు నగుకుంట బేటా! లచ్చన్న అంటనె విలుస్తుండె! ఇంగనవాబుకు నజరేంది? తనకు బెదు రేంది? ఇట్ల తయారై ఆయింత మేము రేపు ఎదుర్కోళ్లనంగ పెండ్లిల్లు జేర్నం.

పెద్దమణుసులోలె మా అక్కయారాలు, ఆడివిల్ల రాగమ్మ, మా మ్యానత్తలు లాం చినాలు నడుపంగ పిల్లకు మైలపోలు దీపిచ్చి ! స్తానాలు జేపిచ్చి ! అలంకారం జేసి పీటల మీద కూసోవెట్టి ముత్తైదలు కుందెనవెట్టి దంచిన బియ్యాన్ని రోకండ్ల పొన్నుకు బంగా రు కడెందొడ్గి కొట్నం బెట్టిన్రు.

ఇంతట్లకె ఐరోనికుండలు, గర్గెబుడ్లొచ్చినయి, కూరాడు నీరాళ్ల పూజిచ్చిన్రు ఆయ్యగారొచ్చి ఐరోనికుండలకాడ గోడకు '(శ్రీ)శుభమస్తు' అంటరాసి ఏందోమంత్రం జదివిండు. మా(శ్రీ) పెండ్లిపిల్లైంది.

ఆపొద్దంత ముత్తైదలకు తీరికేలేదు, వొడిబియ్యంగల్పుడు, తలువాల బియ్యం గల్పుడు, సారెపెట్టె తయారు జేసుడు ముత్తైదలకు గాజులు దొడిగిచ్చుడు తోటే సరి పోయింది. ఉల్లెడవట్కె పోయిన మొగోండ్లకు చాయ పలారం అందిచ్చ చిన్నమ్మల వొంతైంది. ఇంతట్లకె బోజినాల పొద్దైతది, అందర్ని కూడగట్టి వొడ్డన్లు జేసి ఇంటోళ్ల బంతిలేసె వరకు మూడు ఝాములాయె. చేసి చేసి పెద్దోళ్లిట్ల నడ్ములు వాలుస్తరొలేదొ 'ఎదురుకోళ్లకు తయారు జేయిండి' అంట బంకుల్ల కెళ్లి వర్తమానాలొస్తవి. ఆ మాటి నంగనె సింగారాలు జేస్కుంట మంట దువ్వెన్లు నెత్తులల్ల జెక్కి ఏందొపని వున్నట్ల ఒగరిసేతుల పని ముట్లు వొగరు అందుకుంట దిర్గుతరు దోరవయిసు ఆడివిల్లలు. అదో కండ్లపండుగ. ఇంతట్లకె పెండ్లోళ్లొచ్చిరొచ్చిరంట గడుబిడి ఎక్కుడాయె. అంత బాగె గని విడిది ఏర్పాట్లు జూతమంట పెద్దబామ్మర్ది వొయి ఆడ వుండాల్సిన మంచాలు,

పర్పులు, జంకానాలు, కుర్సీలు, మంచినీళ్లచెంబు, గిలాస, ఇస్నకర్రలు ,ఇస్పెట్లు అన్ని పార జూసివొచ్చె.

మావోండ్లు వొచ్చిన పెండ్లోళ్లను విడిది జేరనియ్యకుండ ఊరవతల అనుమాండ్ల గుడెన్క తోటల దింపిన్రు.

ఆడివిల్లలకు అక్క మొగుడెట్లుంటడో ? సూతమంట ఆరాటమెక్కువై కండ్ల వడ్డ తబుకులు వట్టుకోని మేమొస్తమంటె మేం అంట తయారైరి. బావ ఎట్లుండడో ? తాన్జూసి అక్కకు అంటిత్తమని మాపిల్ల లక్ష్మిగూడ తయారాయె. అంత పిల్లల పరాస్క మోలె వుంటదని నేను, ఆడివిల్ల రాగవ్వ, ఇంగో ఇద్దరు పెద్దమణుసులు రాంగ మొగోండ్లు బాజజంత్రీలు దీస్కోని మంగళార్తి తబుకులు ముందు నడువంగ బయిలెల్లిరి.

అడ్కివోంగనె వోపదిమంది మొగోండ్లు ఎన్కటి తరీఖల దోతులగట్టి బుజాన సెల్ల లేసుకున్నరు ! పిల్లగాణి తాత,మ్యానమామ నెత్తులకు రుమాళ్లుగట్టుకున్నరు. గని పిలగాణి దోస్తులో ఏందో ? ఏందా ఏంది ? వాండ్లె, వాళ్ల కుడ్తలు లాల్చీలు, బొందె అంగీలు, లాగులు, నిమాస్తిన్లు, వాసుకోట్లు, పాయింట్లు దొడుక్కోని జంఖాన్లగూసోని గప్పాలుగొడ్తుండరు..

ఎదూర్గ ఆలాబురిగ గూసున్న వయిసుపోర గాండ్లను జూసి మంగళార్తులు వట్టుకున్నోళ్లు ఎన్కముందైతుంటె, నేను సార్వజేస్కోని వాండ్లను దాటేస్కుంట వోంగనె రావల్సినోళ్లు నాఎంట నడ్సిరి, మేం ఆడోండ్లకు పస్పుకుంకుమ లొంచి అత్తరు రాసిపన్నీరు సిల్కరిస్తిమి, మేమిట్ల ఆచారం నడ్పుతుంటె, ఆడివిల్లలు ఒగదాని బుజాలు ఒగతి వట్టుకోని ఇందుట్ల పెండ్లికొడ్కెవరొ ? అంటుంటె, ఇంగో చిత్రాంగి అదేంది ! సెంపన సుక్కవెట్టుకోని మెళ్ల సెంద్రహారం ఏస్కోని సుక్కల్ల చెంద్రునోలె గూసున్నడు .అంట జెప్తె అడివిల్లలంత మొకం నిండకండ్లు జేస్కోని ఒక్కసారి జూసి బర్వుగ రెప్పలు కిందికి వాల్చి పక్కకు జూస్తుంటె పక్కలున్న మొగపోరలు కారుణం లేందె పండ్లిగిలిచ్చు కుంట, జేబులల్ల కెల్లి దస్తీలు దీస్కోని మొకాలు దుడ్సు కోవట్టిరి. ఇంగవాండ్లల్ల వాండ్లు బాసల మాట్లాడుకుంట ఏందో అన వోయిరి గని, ఏరెతావు కొచ్చినం గంబీరంగ వుండాల్నంట అనుకున్నరొ? ఏందొ ? ఎకిలిశాస్త్రలేవి జేయకుండ, పెద్ద పోకడల్తోటి మర్యాదలు నటిచ్చిరి. ఆడోండ్లకు

వందనం నడ్పినంక అయ్యగారు జెప్పినట్లల్ల అల్లుణి పూజ జరిగె. అటెంక రివాజు పోంటి బామ్మర్ది ఆడ గూసున్న దోస్తులందరికి కుంకుమ బొట్లుదిద్దె. ఆబొట్ల తోటిలైట్ల ఎల్తుర్ల పోరల మొకాలు ఎల్తుర్లు జిమ్మవట్టె.

ఇంగ ఎదురుకోళ్ల తదంగంల మిగులు వడిన కార్యం బుక్కగులాలు సల్లు కునుడు, పెద్దమణుసులు లాంచినానికి ఏలద్ది గులాలు చెంపలకు రాసి బుక్కచిల్కరిస్తె ఎన్క తబుకులల్ల కెళ్లి బుక్కదీసి పుప్పొడివాన గుప్పినట్లు ఎర్గనట్లె వున్న ఆడివిల్లలు పెండ్లికొడ్కుదోస్తుల మీద గుప్పిచ్చిరి.ఎవరి సంబరంవాళ్లది,ఎవరు ఎవరి మీదజల్లిన్రో.ఎవ్వరికి దెల్వదు.సెప్పొద్దు గని నా బిడ్డ పోరి ఈడ్కిగుడ పాయింటు దొడుక్కోనె వొచ్చింది. అదిజూసి దీనికి ఆడిదాన్నన్న సోయిగుడ లేదంట మిడ్కిన .మరి నేను ఆసాంతం వోకన్ను వాండ్ల దిక్కువెట్టి పాటిచ్చిసూశ్నగద ! అందుట్ల నాపిల్ల ఎగిరెగిరి బుక్క గుప్పింది. ఇందరు దోస్తులల్ల వోపిలగాడు బాలు వెంచి అవి మొకాన వడ్తుంటె లెక్కలేకుండ మొల్కనారోలె , గీక్కోని గడ్డం,మీసం గాన్రాంగ కండ్లకు బూతద్దాలోలె సురచ్చినాలు వెట్టుకోని రెప్ప వాల్చకుండ మాపిల్లనె జూస్కుంట నిలవడ్డట్లని పిచ్చింది. పాపం వాణిదిక్కు ఎవ్వరి కన్నువోలేదు.

ఇంతట్లకె, బోజినాలకు పొద్దువోతది, విడ్దిలకు వోదవంట మావోండ్లు పెండ్లోళ్లను తొందరవెట్టుకుంట తెచ్చిన పల్లకిల పెండ్లికొడ్కును కూసుండుమంటె 'నా పల్లకిపిలీజ్' అంట ఒక్కకుత్కెతోటి అందరు వల్కిరి. ఆయితె 'గుర్రమన్న ఎక్కి రావయ్య ' అంట బామ్మర్ది ఎంత గీమాల్నగని ఎక్కనంటె ఎక్కనని. అందరికంటె తొలిగ మాపోరి పదారుపండ్లి గిలిచ్చి 'కిచ్చ కిచ్చ'నగవట్టె, పుట్టిన గోలె మా ఆయన బిడ్డను గుడ్లుర్మి సూడంగ నేను సూడలేదుగని, ఆనాడు జూసిన. ఇంగ ఎట్లైతె ఏంది ? గుర్రం మీద తోడుపెండ్లికొడ్కు, పల్లాకిల, మా పెద్దత్త మన్మరాండ్లు ఎక్కి మెరిమెణోలె వోయిరి. పెండ్లికొడ్కు దోస్తులెంట ముద్దుగ నడ్సు కుంట విడిది జేరె. విడిదింట్లకు పాన్కపుకుండలు, సల్లంబళ్లు దీస్కొచ్చి పెట్టిరి. ఆవిట్ని తాగిందెవరు ? ఆదిక్కు జూసిందెవరు ? ఎన్కటికి ఎర్రటి ఎండలల్ల పయినం జేసి వొస్తరుగన్క దూపదీరా సల్లయిత్తులేసిన పాన్కం, అట్లెసల్లగిన పంపెటోళ్లు, అది వో లాంచినమై నిల్సింది. ఈనాటికి అందికె మా వోండ్లు గుడ అవి పంపిన్రు.

ఇంగ మా ఇంట్ల ఆ రాత్రి ఆడిపోరగాండ్లు నిద్రలు వోతెవొట్టు ఏందో యాది జేస్కున్నట్ల ఒగతి లేసి ఇంగొరికి జెప్తది. అందరు ఆ మాటవట్టుకోని ఒక్కటె నగులు. ఇట్ల అర్ధమ్మరాతిరిదాంక మేల్కోని యాడ జరసేపు కూర్కువట్టిన్రొ లేదొ ? కోళ్లుగూసె, కోళ్ల గూయంగనె విడిదింట్ల పెండ్లికొడ్కుకు, పండ్ల దోమ బురష్, పేస్టు, సబ్బు, తువాల, అర్దం, దువ్వెన, నూనెసీస, దీస్కపోవాల్నంట, యామర్దలు పోరిని బతిలాడిన గని వూఁనేను వోనంటే, పోనంట గూసుంటె చిన్నబామ్మర్ది గొంచవాయె.

ఇంగ ఆడివిల్లకు ముట్టవల్సిన బాబతు బిందెలు, బకీటు, చెంబులు, సీర, అర్దం, దువ్వెన అలంకారం సామానంత మా అక్క ఆడి విల్ల మోపిచ్చుకపోయి ముట్టజెప్పి వొచ్చె.

ఇంతట్లకె మా అక్క ఆరాట పడుకుంట పొద్దుబారెడెక్కవట్టె పెండ్లికొడ్క దొరను వట్టిచ్చుకున్నట్లె లేదు, విడిదిలకు చాయె, పలారాలు గొంచవోరా? ఎట్ల ? పెద్ద మణుసులంత ఇంటి పనులల్ల తీర్కలేకుండ మున్గి తేల్తుండరు, పనోండ్లతోటివంపితె, ఏందొ ? ఎట్లనొ ? ఆయింత తినస్కారం జేసినట్లనుకుంటె కష్టం అంట మిడ్కు తుంటె, అల్లుణి కోసం ఆవలీవల వడుతున్న తల్లిని జూసి ముసిముసి నగుకుంట శ్రీ అరలకు వోంగనె తెరకెక్కిన బొమ్మలోలె మా 'శ్రీ' దోస్తులంత ఎన్కటి తరీకల సొమ్ములు సీరలు సింగారిచ్చి ఒగరెంట ఒగరొచ్చి నిలవడిరి, అన్నిటికంటె నాకండ్లను నేను నమ్మలేని ఇచిత్రం ఏందంటె? నా బిడ్డలక్ష్మి మొగషోకు ఇడ్సి అడ్డసొల్లనింబోళి సీర గట్టి, గట్టిఅంచురయికె దొడ్గి, మెల్లమొగ్గల దండ చేతికి దండ పట్టి కండ్లకు కొసెల్ల కాట్క దీర్చి, నొష్టిన ఎర్రటితిల్కం మెరవంగ'అమ్మ' బావకు చాయె, పలారాలు మేంగొంచవో తమంట గల్లుగల్లున కాళ్లగజ్జెల పట్టీలు మోగంగ వొచ్చె, దాని సింగారం జూసి వోరెప్పపాటు బీరు వోయిన నేను 'నాతల్లి చెంద్రదీపెం' అంట మెచ్చుకోని అట్లెగొంచ వోండి అంట ఆడ్కవోయి నడ్వాల్సిన తరీఖజెప్పితి.

ఇంత కొత్త సొగుసుల తయారైన మాపిల్లల జూసి పనిపోరగాండ్లు గుడ మేమంటె మేం అనుకుంట నెత్తికి తువాళ్లు జుట్టుకోని పలారపుగంపలు, కోపుతస్తర్లు, కిస్తీలు, చాయె దాన్లు, గిలాసలు వట్టుకోని నిలవడిరి. ఈతమాస జూసి కుశాలు వట్ట లేక సన్నాయి బాలయ్య డోలు రాజయ్య ఇద్దరు మేమొస్తమంట మాసొర్సెగుడవారకుండ వాళ్లంతకు వాళ్లు యా లాంచినానికి ఎల్తిరాకుండ బయిలెల్లిరి, ఈ కరామతంత జూసి నేనే ఎడ్డీర్కంల వడ్డట్లనిపిచ్చింది.

పాపం విడ్డిల ఆడోళ్లేమొ స్తానాలు జేసి సిగెలు ముడ్సుకోని సింగారాలు జేస్కునె పనిమీదుండరు. పెండ్లికొడ్కు దోస్తులంత అప్పుడప్పుడెలేసి, చెదిర్న క్రాపులతోటి, నలిగిన బట్టలతోటి, తీరొక్క తీరున ఇంటి ముంగలి అరుగు గోడలెక్కి యాపసెట్టెక్కి గుడ గూసున్నరు. అనుకోకుండ తీర్సిన బొమ్మలోలెవొచ్చిన ఆడివిల్లల పట్లన్ జూసి ఏం దోసక హలో, హలో, అని కూసోవెట్ట కుర్సీల కోసం దేవులాడుతుంటె, అంతట్లకె మా పిల్ల అందుకోని ''మాఇంట్ల మాకు మర్యాద లేం వొద్దుగని'' చాయె సల్లార్తది తాగుండి మా బావ ఖాసుదోస్తులు అన్నదంట.

ఈమాటిన్న బూతద్దాల పిలగాడందుకోని 'మాదోస్తు ఖాసు మర్దలా ''థియరీ ఆఫ్ మ్యాగ్నెటిజం తప్పువోతాది ? మ్యాగ్నెటిక్ ఫీల్డు ఇంత పవర్ ఫుల్ ''గ ఉంటదని ఇప్పుడె దెల్సుకున్న'' అంట అన్నడంట.

అదిన్న ఆడివిల్లలు అవ్వొ ! వొల్లడు బెల్లం బువ్వ, ఈ మతిమర్పుల ప్రొఫెసరయ్యకు గుడ పరాశ్కం ఆడొచ్చిందేమె? చిల్క ? అంట నోరుజారి అనంగనె ?

పెండ్లికొడ్కు పెద్దగ నగుకుంట 'వాట్ ఎఫెంటాస్టిక్‌నేం ! సొ యు ఆర్ చిల్క. వండర్‌ఫుల్'' అంటుంటె, ఆడిమొగ అంట ఏరు తారు లేకుండ అందరు నగుల జల్లుగురిసిన్రు.

ఆ విడిదిల మూతిర్పులు లేవు, ముక్కిర్పులు లేవు, ఇది తక్కువ అది తక్కువ అంట అడ్గినోల్లె లేరు, ముద్దుగ అందరు గల్సి నగుకుంట ముర్సుకుంట బావ మరుదండ్లు వొడ్డియ్యంగ అందరు పలారం దిని చాయ్ దాగిన్రు. ఎంటొచ్చినపనోండ్లకు, బజంత్రోండ్లకు చాయె , నాష్టఇస్తె వాళ్ల కుసి సెప్పతరం గాలేదు.

ఇట్ల అన్ని ముట్ట జెప్పి నగుకుంట తుళ్లకుంట ఇల్లు జేరొచ్చి నోళ్లను పలారం దిసుండి బొద్దు పొద్దువాయె అంటె ఆడున్న పోరడందుకోని 'అయ్యొ ! ఇందాకవుపాసం ఉన్నారు? పెండ్లికొడ్కుదొర ఎంటనె, దోస్తులు గూడంగ గల్సి తిన్నరంట , జెప్పి వాడు నెత్తి రుమాలు కండ్లమీదికిగుంజుకునె,.

ఆడివోరలంత పెండ్లి పడ్చు అరలకువోయి, తలుపులు దగ్గరేస్కోని ఒక్కటె కిల కిలలు, గుసగుసలు. అవేం ముచ్చెట్లొ ? ఏంకతనొ ? ఒగమ్మొచ్చి రంగుకాయితాలుకొంచె వోతె , ఇంగోపిల్లొచ్చి, కత్తెర సూదిదారం గొంచవోతది, వోపిల్ల కారప్పొడిగొంచవోతె,

ఇంగోపోరి తవుడుగొంచవాయె. ఇట్లగొంచవోయిన వస్తువుల తోటి ముద్దుగ, కర్జెకాయలు జేసి ! కిస్తీలల్ల పొందికంగ అమర్చి ! ఒగటి 'బావకు' ఇంగోటి బావదోస్తులకంట ప్రత్యేకంగ రాసిపంపిరి . పంపినోళ్లు వూకెపంపినారు? దానెంట -

'సుక్కల్ల సెంద్రుడాని
సూడసక్కానైన అక్కనేమొ ఇస్తిమోయమ్మ !
బడాయి బావ దోస్తుల బల్లమేమొ బాగలేదమ్మ !
పగడమాని, ముత్తెమాని
మురిపాల దొంతినేమొ ! ఇస్తిమోయమ్మ
కొంటెసూపు పెండ్లి కొడుకు
కోతిదోస్తులేమొ ! బాగలేరమ్మ !
పట్టారాని పంచరంగుల పసిడి సిల్కలోయమ్మ !
ముద్దెమాసేటి ముత్యాల గొల్కలోయమ్మ
చేపట్టే చేవలున్న - దండి బుద్ధిమంతూ లెవరో తెలుపమ్మా !

అంట రాసి పాడి టేపుజేసి దాన్నో సిన్నపోరణి కిచ్చి పంపిరి. యామాట కామాటే గని, నిజం జెప్పాల్నంటె శరారత్ కొస్తె మన ఆడివిల్లల కన్న మొగపిల్లలె జర అంబాదగ కండ్లవడ్తరు. పలారపు కిస్తీల్ల తమ పేర్లు జూస్కోని తలోగర్జె అందు, కొర్కి కారం కారమంట నోరు మండంగ శక్కర సీసంత కాలిజేసి గిలాసల కొద్ది నీళ్లు దాగిన్రంట.

ఇంత కంటె ఘాటైన తిరుమంత్రం జెప్పుతుండిరి గని, వునికి పట్టు తమది గాదు, అంనగని ఏం దోసక వుద్దనగ వోకారటు కత్తరిచ్చి దానిమీద చి.సౌ.చిల్కకు, చి. భాస్కర్ M.Sc (Research Scholar O.U.)కి ఈ సాయంకాలం 5 1/2 గం6 నిమిషాలకు ఎంగేజ్‌మెంట్ విడిదింటిలో ఏర్పాటు చేయబడింది. అంట రాసి అత్తరు రాసి, కుంకుమ రుద్ది, కజ్జెరపండ్లు,పోకలు వెట్టి పోరణిసేతుల వోరూపాయి వెట్టి "సూద్రా ! ఇది పెద్దోండ్ల కంట్లె వడకుండ సిన్నమ్మల కియ్యాలె' అంట నూటొక్క బద్రాలు వల్కి తోలిన్రు. తొందరపాటు తోటి ఏదో చేసిన్రు గని దాని నతీజ ఎట్లుంటదో? అంట ఎన్కసీరికి అంత మిడుక్కుంట గూసున్నరు.

రూపాయి రుష్వత్ దిన్న పోరడు రొండో కంట్ల వడకుండ కారటు గొంచ వోయి సూడు సూడు వంట సిల్కమ్మ సేతుల్నె వెట్టిండు. ఆది జూసినంక ఇందాక ఎల్లిపాయ పటాకోల్నె ఎగిరెగిర పడ్తున్న మా పిల్ల లోపట్నె కుమిలి కుమిలి ఏడ్సిందేమొ, కండ్లెర్రగ గాంగ బుసలు గొట్టుకుంట దిర్గుతుండది, తోటి పిల్లలందరు గాలిదీసిన బుగ్గలోలె సప్పున సల్లారింద్రు.

ఇంగ పెండ్లి ముహూర్తం రానె వొచ్చె అందరు బుజబుజమంట పెండ్లి పిల్లను దోల్కోని పందిట్లకు నడ్సిరి.

మంగళార్తులు ముందునడువంగ బాసింగాలుగట్టుకోని సేతుల అడుకొత్తువట్టుకోని పెండ్లి కొడ్కు ఠీవిగ నడ్సుకుంట పందిట్ల కొచ్చె. పెండ్లికొడ్కుదోస్తులంత దోతులు గట్టి నలమారాజు రూపుకంల వొచ్చిన ఇంద్రాది దేవుతలోలె గండ్ల వడవట్టిరి; గని పాటిచ్చి సూస్తె ఆడివిల్లలంత సోకులు గీకులు లేకుండ సాపు సీదగ వొచ్చి, వొచ్చిన సుట్టాలను మర్యాదగ తోలుకొచ్చి కూసోవెట్టుకుంట, నిమిలేటు సీసాలందిచ్చుకుంట, మొగపిల్లల కండ్లు గల్సినప్పుడల్ల మూతులు దిప్పి, మింగుద మన్నంత గుర్రున జూస్కుంట వుండిరి.

పాపం ! కండ్లల్ల వొచ్చెనీళ్లను ఆగవట్టుకుంట , మాపిల్లకాడ్కొచ్చి, ప్లీజ్! ఒక్క సారి నావూటినవు, ఐయామ్ సారి, బట్ ఐలవ్‌యు వై డార్లింగ్ అంట సెప్పి పోయిండంట జునుపాలపిలగాడు.

ఇంత కింతకు మా పిల్ల మొకం మబ్బులిడ్సిన చంద్రునోలె ఎలుగవట్టె, ఇది జూసిన దాని దోస్తులంత దాన్ని జూసి,''అవ్మ! దొంగ, ! ఏం నంగనాచి తుంగ బుర్రవమ్మ! ఏమెరుగని ఎల్లిపాయె దొంతులేస్తె దొల్లిపాయనంట'' ఎప్పుడు మెచ్చితివి ? ఎప్పుడు తారిస్తివి. సిగ్నలు బాగనె అందుకున్నడు పరిసోదకుడు. అంట పరాశ్కమాడిరి.

పెండ్లంత అయినంక తెల్లారి ఇంటి కొత్తల్లుడు వాళ్ల మామనూ మాఆయినను జూసి, తన దోస్తు బాస్కర్ను పొగుడుకుంట, మన లక్ష్మి అదృష్టవంతురాలు, వాణి నిలువెత్తు బంగారం బోసినా కొనలేని సవందం, వాడ్డై వాడు ముందుకొచ్చి అడ్గుతున్నప్పుడు తథాస్తు అనుండి, అంట జెప్పిండు.

అప్పుడు దోస్తులంత వానాకాలం వురుము ఇని పురిఇప్పి ఆడె నెమిళ్లోలె వుల్లాసం బట్ట లేక పుంగిళ్లు వూసిన్రు. మా పిల్లకు అప్పుడె పెండ్లి కళరాంగ సిగ్గు లొల్కవట్టింది. అవును శ్రావణమాసంల నిశ్చితార్థం జేస్కుందం, మీ పెద్దోళ్లను దెల్సుకోని మతులబు సెప్పునాయిన అంట అన్న.

విడిదింట్ల నిజంగనె దావతైంది మర్నాడు.